# వేణ్ణీళ్ళు

"ఏవండీ! ఈ దట్టీ అడవిలోకి గేస్ సిలెండర్ తెప్పించుకోవాలంటే చచ్చే చావౌతోంది. అరవై కిలో మీటర్ల అవతలున్న టౌన్ నుంచి తెచ్చుకోవాలట. ఈ లెక్కన వేణ్ణీళ్ళు స్టవ్ మీద కాచుకోవడం కుదరదు. పోనీ హీటర్ పెడదామంటే ఒకటే పవర్ కట్. ఒక మోపు కట్టెలు పంపించండి. పని మనిషి చేత కట్టెల పొయ్యి మంట పెట్టిస్తాను. ఈ చల్లో చన్నీళ్ళస్నానం నా తరం కాదు బాబూ"! భార్యామణి చదువుతున్న భారతాన్ని వింటూ, మౌనంగా బుల్లెట్ బైటికి తీసి స్టార్ట్ చేశాడు రేంజర్ రాఘవరావు.

ఆ సాయంత్రానికి ఎండు కట్టెల మోపొకటి రేంజర్ గారి పెరట్లో ప్రత్యక్షమైంది. ఆ మోపుతో దొరికి పోయిన బక్క చిక్కిన ముసలాడు రెండు చేతులూ జోడించి కళ్ళ నీళ్లతో ప్రాథేయపడుతున్నాడు. "బాబ్బాబూ! బుద్ధి గడ్డి తిని పొరపాటైపోయింది బాబూ! ఇంకెప్పుడూ ఇంత పనికి మాలిన పని సెయ్యను బాబూ!



ఇక మీద అడివిలోకెల్లి పుల్ల ముక్క లేరుకుంటే మీ ఎడం కాలి సెప్పచ్చుక్కొట్టండి. ఈ పాలికీ తప్పు కాయండి బాబూ" అంటూ.

ఆడవాళ్ళతోనూ, అపర దరిద్రులతోనూ మాట్లా డడం రేంజరుగారికి చిరాకు. అందుకే ఆయన ఆ గోడు విన్పించకోకుండా లోపలి కెళ్ళిపోయాడు. సూర్యుడితో బాటు ముసలాడి ఆశ కూడా అస్తమించగా నిస్పృహగా వెనక్కి తిరిగేడు.

ఆ రాత్రి......

వేణ్ణీళ్ళ స్నానానంతరం రేంజరమ్మగారు (రేంజరు గారి భార్య) చల్లుకున్న ఫారిన్ పెర్ఫ్యూమ్ పరిమళాలు పరిసరాల్ని గమ్మత్తైన మత్తులో ముంచుతున్నాయి.

వేణ్ణీళ్లతో స్నానం చేసి, వేసిన చికెన్ ముక్కల్ని వేట్ పిక్నీ నైవ్‌లో నంజుకుంటున్న రేంజర్ గారికి-

కట్టెలమ్మితేనేగాని పొట్టగడవని బక్క ముసలాడి కుటుంబం ఆ చలి రాత్రి తాగేందుకు వేణ్ణీళ్ళు కూడా లేక, వెన్నెముక కంటుకున్న ఆకలి కడుపులతో ముడు చుకు పడుకున్నారనే విషయం ఊహలోకి కూడా రాలేదు.

కె. వరలక్ష్మి

# ఎస్ సర్, బట్ నో సర్

ఆ రోజు నాయుడుపాలెం కమ్యూనిటీ హాల్లో ఫలానా బ్యాంకి స్థానిక బ్రాంచి పదో వార్షికోత్సవం జరుగు తోంది. ఖాతాదారులతో సంబంధాలు పటిష్టం చేసుకోన డానికి బాంకి మేనేజిమెంట్‌లు అప్పుడప్పుడు 'డిపాజిట్ వీక్' అనో, 'బ్రాంచి యానివర్సరీ' అనో ఇలాంటి ఉత్సవాలు జరిపి కష్టమర్లని ఆకట్టుకోవడానికి ప్రయత్ని స్తుంటాయి.

పూలదండలు, పొగడ్తలు, ఉపన్యాసాలతో ఫలానా బ్యాంకి వార్షికోత్సవ సభ జయప్రదంగా ముగిసింది. స్టేజీ మీద నుంచి అతిథులు నిష్క్రమిస్తుండగా ప్రక టన జరిగింది. ఆ రోజు కార్యక్రమంలో చివరి అంశంగా బ్యాంకు సిబ్బందిచే 'రామాంజనేయ యుద్ధం' చివరి సీను ప్రదర్శింపబడుతోంది అని —

స్టేజి వెనుక గ్రీన్‌రూంలో రామ పాత్రధారి అయిన బ్యాంకి మేనేజర్ భక్తినాథం, హనుమంతుడి వేషంలో తోక సరిగ్గా అమరిందో లేదో చూసుకుంటున్న క్యాషి యర్ శరాబందిరావుని హెచ్చరించి, తను స్టేజి మీదకు పద్యం ఎత్తుకుంటూ వెళ్ళాడు. శరాబంది తన డైలా గుల్ని, పద్యాల్ని మరోసారి మననం చేసుకున్నాడు. రాముడు ఆంజనేయుణ్ణి, యయాతి మహారాజును విడిచి పెట్టెదనా? లేదా అని అడుగుతాడు. ఆంజనేయుడు విడువనంటాడు. రాముడు కోపంగా రెండు పద్యాలు పాడి మళ్ళీ అడుగుతాడు. 'యయాతిని విడిచెదనా లేదా?' అని. ఆంజనేయుడు విడువనంటాడు. ఈ సారి రాముడు మరో నాలుగు పద్యాల్లో హనుమంతుణ్ణి తిట్టి మళ్ళీ అడుగుతాడు. ఇదీ వరస. ఈ విధంగా సీను ముగిసే సరికి రాముడు ఓ డజను పద్యాలు పాడాలి. హనుమంతుడికి 'యయాతిని విడువను' అని తప్ప పెద్దగా డైలాగులు లేవు, పద్యాలూ లేవు 'నాయుడు పాలెం వాళ్ళకి నాటకాల పిచ్చి వుందని తెలుసుకున్న కొత్త మేనేజర్ భక్తినాథం తన డజనున్నర పద్యాల్తో జనాన్ని ఆకట్టుకోడానికి వేసిన పథకం అన్న మాట ఇది అనుకున్నాడు క్యాషియర్ శరాబందిరావు.

ఇక హనుమంతుడు రంగ ప్రవేశం చెయ్యాలి.

ఇంతలో తోటి క్యాషియర్ వేదాచలం వచ్చి శరాబంది రావు చెవి కొరికాడు. "మన మేనేజరు నిన్ను మోసం చేశాడు గురూ! తనకసలు రికమెండేషన్లు అంటే గిట్టవని నీ ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ ముఖాన విసిరి కొట్టాడా, ఇప్పుడు చూడు నువ్వు ట్రాన్స్‌ఫర్ అడిగిన వూరికి తన మేనల్లుడిని తన పలుకుబడి మీద వేయిం చాడు. ఇప్పుడే తెలిసింది" అని సానుభూతి చూపి నిష్క్రమించాడు. శరాబందిరావుకి నిలువెల్లా భగ్గు మంది. స్టేజి మీదకి చూశాడు. మేనేజర్ రావణా సురుడిలా కనపడ్డాడు. క్షణాల్లో నిశ్చయించుకున్నాడు. తనిప్పుడు చెయ్యాల్సింది రామాంజనేయ యుద్ధంకాదు. చెయ్యాల్సింది లంకా దహనం. స్టేజి మీద కెళ్ళి మేనేజరు కన్ను రాముడికేసి చూశాడు హనుమంతుడు కన్ను శరాబందిరావు.

రాముడు రెట్టించి అడిగాడు "ఆంజనేయా! చెప్పుము. యయాతిని విడిచి పెట్టెదనా లేదా...?"

"ఎప్పుడో విడిచి పెట్టితిని, నాని ని ఇష్టం



వచ్చినట్టు చేసుకొనుము లేదాని నెత్తి మీదకు ఎక్కించు కొనుము" అనేసి గిరుక్కున వెనక్కి తిరిగి నిష్క్ర మించాడు ఆంజనేయుడు.

కేకలు, నవ్వులు, ఈలల మధ్య తెర పడుతుండగా శ్రీరాముడికి స్పృహ తప్పింది.

— దేవరకొండ మురళి

